క్లుప్తంగా

ముగిసిన సంగమేశ్వరుని కల్యాణోత్సవాలు



నందిగామరూరల్: దాములూరు కూడలి సంగమేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రుద్రహోమం, శ్రీసూక్తదుర్గా సూక్త హోమాలు, పూర్ణాహుతి, వసంతోత్సవం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. ముందుగా స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి దాములూరు శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ నరసింహమూర్తి, ఉత్సవ కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ఆటోడ్రైవర్‌కు తీవ్రగాయాలు

కంచికచర్ల: మద్యం మత్తులో ఓడ్రైవర్ ఆటోతో డివైడర్‌ను ఢీకొనడం తీవ్రగాయాలపాలైన సంఘటన కీసర మునేటి బ్రిడ్జి వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం చందర్లపాడు గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ ఆదాంతోపాటు మరొక వ్యక్తి నందిగామ వైపు నుంచి కంచికచర్ల వైపుకు ఆటోలో వస్తున్నారు. మండలంలోని కీసర మునేటి బ్రిడ్జి వద్దకు రాగానే ఆటో డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆదాం తలకు తీవ్రగాయాలయ్యాయి, మరొక వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న నేషనల్ హైవే అంబులెన్స్ వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడికి ప్రాథమికచికిత్స చేశారు. అనంతరం అతన్ని నందిగామ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

యువకుడిపై కత్తితో దాడి

జగ్గయ్యపేట: స్నేహితుల మధ్య జరిగిన ఘర్షణలో కత్తితో దాడిచేయగా ఓవ్యక్తి తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం పట్టణంలోని సత్యానారాయణపురంలో జరిగింది. వివరాల్లోకి వెళితే క్రిష్టియన్‌పేటకు చెందిన షేక్ నజీర్ పూలడెకరేషన్‌తో మంటపాలు కడుతుంటాడు. ఈ క్రమంలో ఈనెల 26న మహాశివరాత్రి సందర్భంగా ముక్త్యాలలో చెరువు బజారుకు చెందిన అయ్యప్ప, లేతట్ల ధనమూర్తిలతో నజీర్ ఘర్షణ పడ్డాడు. నజీర్ షేర్‌మహ్మద్‌పేట వెళ్తుండగా అయ్యప్ప, ధనమూర్తి అతనిపై కత్తితో దాడి చేసి పరారయ్యారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నజీర్‌ను అతని స్నేహితులు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన వైద్య నిమిత్తం అతన్ని విజయవాడ తరలించారు. ఈఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలంటూ ఆందోళన



చందర్లపాడు(నందిగామ రూరల్): బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామ సమీపంలో ఎమ్మార్పీఎస్, ఎస్సీ నాయకులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 25న రాత్రి మిర్చిలోడ్ ట్రాక్టర్ ఢీకొనడంతో ముప్పాళ్ల గ్రామానికి చెందిన వల్లపు దాసు రాజశేఖర్ భార్య సంధ్య మృతి చెందిందని, మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. రాజశేఖర్ కూడా కోమాలో ఉన్నాడని, అతనికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. గ్రామ సమీపంలో ప్రమాదం జరిగిన చోటనే రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారన్నారు. చిన్నారులంతా ఐదేళ్లలోపు వారేనని, వారిని ఆదుకోవాలని కోరారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ దుర్గామహేశ్వరరావు, గ్రామనాయకులు అక్కడకు చేరుకుని సర్దిజెప్పడంతో ఆందోళన విరమించారు.

బావిలో పడి వ్యక్తి మృతి



కీసర(కంచికచర్ల): ఓ వ్యక్తి బహిర్భూమికి వెళ్తుండగా ప్రమాదవశాత్తూ కాలు జారి బావిలో పడి మృతి చెందిన సంఘటన మండలంలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ రాజు కథనం మేరకు మండలంలోని కీసర గ్రామానికి చెందిన తలమాల సుధీర్(36) అనే వ్యక్తి ఆటో నడటంతో పాటు అప్పడప్పుడు కూలి పనులకు వెళ్తుంటాడు. శుక్రవారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్తుండగా అదే దారిలో ఉపయోగంలో లేని నేల బావి ఉండటంతో ప్రమాదవశాత్తూ కాలుజారి బావిలో పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే కంచికచర్ల అగ్నిమాపక కేంద్ర సిబ్బందికి సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక కేంద్ర సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని బావిలో ఉన్న వ్యక్తిని ఒడ్డుకు చేర్చారు. అప్పటికే సుధీర్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతని కుటుంబసభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతునికి భార్య కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నందిగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు : తన్నీరు



కల్లంలో మిర్చిని పరిశీలిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు

శివాపురం(పెనుగంచిప్రోలు): రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు విమర్శించారు. మండలంలోని శివాపురం మిర్చి కల్లాలతోపాటు నల్లి, తామరపురుగు కారణంగా దెబ్బతిన్న మిర్చి తోటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ మార్కెట్‌లో క్వింటా రూ.13వేలు పలుకుతుంటే, ఢిల్లీలో వ్యవసాయశాఖ మంత్రిని కలిశామని క్వింటాకు రూ రూ.11,781 గిట్టుబాటు ధర కల్పిస్తామంటూ సీఎం చంద్రబాబుతోపాటు ఆయన తనయుడు లోకేష్ ప్రకటనలు చేస్తుండటం శోచనీయమన్నారు. రైతులను కూటమి ప్రభుత్వం దారుణంగా మోసం చేస్తోందన్నారు. గతేడాది వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో క్వింటా మిర్చి ధర రూ.21వేలకుపైగా పలుకగా, ఈసారి ఆస్థాయిలో మద్దతు ధర ఇచ్చే విషయంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. గత జగనన్న ప్రభుత్వంలో పంట నష్టపోయితే రైతులకు ఎకరానికి రూ.49 వేలు అత్యధికంగా నష్టపరిహారం అందజేసిన విషయాన్ని గుర్తుచేశారు. శివాపురం గ్రామంలో రైతు దాములూరి శ్రీనివాసరావు ఎకరన్నర పొలంలో మిర్చిసాగు చేస్తే పంట చేతి కొచ్చే సమయంలో నల్లి, తేమర పురుగు ఆశించి పంటంతా ఎండిపోయిందన్నారు. సాగువ్యయం రూ.2.25లక్షలు కాగా, ప్రస్తుతం దిగుబడి ఎకరానికి రూ.3 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడం మిర్చి రైతుల దీనావస్థను తెలియజేస్తోందని వివరించారు. తెగుళ్ల కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం కింద ఎకరానికి రూ.50వేలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతుల మిర్చిని క్వింటాకు రూ.20 వేలు చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేయడం ద్వారా బాధిత రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మిర్చి రైతుల తరుపున మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోరాడుతున్నారని, రైతులను ప్రభుత్వం ఆదుకోకపోతే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు కొత్తపల్లి పెంటయ్య, బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, మండలాధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు, ఎస్సీసెల్ నాయకులు కన్నమాల శామ్యూల్, రైతు నాయకులు కనగాల రమేష్, లగడపాటి మోహనరావు, పిడికిటి కోటేశ్వరరావు, లగడపాటి సురేష్, ఉన్నం శ్రీనివాసరావు, ధారావతు మహేష్, ఇంజం రవి, ఏలూరి వెంకటరమణ, కురువెళ్ల రాయప్ప, గ్రామపార్టీ అధ్యక్షులు లగడపాటి జనార్దన్, యానాల సురేష్, ఉపసర్పంచి తాళ్లూరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



కస్టోడియన్ శౌరిలమ్మ

జగ్గయ్యపేటఅర్బన్: ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు పేట డివిజన్ కస్టోడియన్, అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాల జేఎల్ శౌరిలమ్మ తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ శనివారం నుంచి ప్రారంభంకానున్న ఈ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఈ పరీక్షలను సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్ స్ట్రీమింగ్‌తో ఎప్పటికప్పుడు జిల్లా అధికారులు, బోర్డు అధికారులు రాష్ట్రంలోని అన్ని సెంటర్ల జరిగే పరీక్షలను పర్యవేక్షిస్తుంటారన్నారు. జగ్గయ్యపేట పట్టణంలో ఇంటర్ పరీక్షలకు నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, మొత్తం 2,171 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఇందులో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు 1,150 మంది, సెకండియర్ విద్యార్థులు 1,021 మంది ఉన్నారన్నారు. పట్టణంలోని వాగ్దేవి మహిళా కళాశాల, శ్రీమతి గెంటేల శకుంతలమ్మ(ఎస్‌జీఎస్) కళాశాల, అమ్మాణి కళాశాల, జేఆర్సీ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఒకేషనల్ కోర్సు పరీక్ష జేఆర్సీ కళాశాలలో జరుగుతుందని, ఈ పరీక్షలకు 457 మంది హాజరుకానున్నారన్నారు. ఇందులో ఫస్టియర్ విద్యార్థులు 284 మంది, సెకండియర్ విద్యార్థులు 173 మంది ఉన్నారన్నారు.

144 సెక్షన్ అమలు..

ఇంటర్మీడియట్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని శౌరీలమ్మ తెలిపారు. ప్రతి సెంటర్‌కు ఒక చీఫ్ సూపరిండెంట్, ఒక డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ ఉంటారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని వివరించారు. పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులు మినహా ఇంకెవ్వరిని అనుమతించబోమన్నారు. 9గంటల్లోపే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, ఒక్క నిముషం ఆలస్యంగా వచ్చినా పరీక్షా కేంద్రంలోకి అనుమతించేది లేదని విద్యార్థులకు సూచించారు.

ఫుడ్ ఫ్యాక్టరీపై కేసు నమోదు

గంద్రాయి(జగ్గయ్యపేట): గ్రామంలోని సినాగ్రో ఫుడ్ ఫ్యాక్టరీపై శుక్రవారం విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. విజయవాడ విజిలెన్స్ ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ ఉమర్ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీలోని అన్ని రికార్డులు తనిఖీ చేశారు. సినాగ్రో ఫుడ్స్ కొన్నేళ్లుగా నాణ్యత లేని వంట సరుకులను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. కాలం చెల్లిన 51రకాల వంట సరుకులను ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారని ఇందులో బూజు పట్టిన మిరపకాయలు, పచ్చళ్లను ప్రాసెస్ చేసి అమ్ముతున్నట్లు గుర్తించినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. అంతే కాకుండా గత ఏడేళ్లుగా లైసెన్స్ లేకుండా అక్రమంగా వ్యాపారాలు సాగిస్తున్నారని వారు వివరించారు. పసుపు, కారం, దనియాల పొడి, మసాల పొడి మాత్రమే లైసెన్స్ లుండగా 47రకాల వంట సరుకులను అనుమతులు లేకుండా విక్రయిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు డిప్యూటీ కమర్షియల్ ట్యాక్స్ అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో లీగల్ మెట్రాలజీ అధికారి సులేమాన్, విజయవాడ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో 69.93 శాతం పోలింగ్

- నందిగామలో 71.55శాతం నమోదు
- జగ్గయ్యపేటలో 68.61శాతం పోలింగ్

నందిగామరూరల్: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో డివిజన్‌లోని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో కలిపి 69.93శాతం పోలింగ్ నమోదైంది. డివిజన్‌లో పట్టభద్రుల ఓటర్లు మొత్తం 16,441మంది ఉండగా, 11,497 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ తెలిపారు. నందిగామ నియోజకవర్గంలో మొత్తం 9,074మంది ఓటర్లుండగా 6,226మంది ఓటుహక్కును వినియోగించుకోవడంతో 68.61 శాతం పోలింగ్ నమోదైంది. జగ్గయ్యపేట నియోజకవర్గంలో మొత్తం 7,367మంది ఓటర్లుండగా 5,271మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవటంతో 71.55 శాతం పోలింగ్ నమోదైంది. నందిగామ నియోజకవర్గంలో అత్యధికంగా కంచికచర్లలోని 39వ పోలింగ్‌కేంద్రంలో 82.50 శాతం ఓటింగ్ నమోదవగా అత్యల్పంగా నందిగామ పట్టణంలోని 31వ పోలింగ్‌కేంద్రంలో 60.86 శాతం ఓటింగ్ నమోదైంది. జగ్గయ్యపేట నియోజకవర్గంలో అత్యధికంగా పెనుగంచిప్రోలులోని 29వ పోలింగ్ కేంద్రంలో 78.36 శాతం పోలింగ్ నమోదుకాగా, అత్యల్పంగా వత్సవాయిలోని 27వ పోలింగ్‌కేంద్రంలో 65.27 శాతం పోలింగ్ నమోదైంది.

పోలింగ్ కేంద్రాల వారీగా వివరాలు..

జగ్గయ్యపేట పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 21వ పోలింగ్‌కేంద్రంలో 796మంది ఓటర్లకుగాను 563మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 22వ పోలింగ్ కేంద్రంలో 681మంది ఓటర్లకు 478 మంది, 23వ పోలింగ్‌కేంద్రంలో 667 మంది ఓటర్లకుగాను 464 మంది, 24వ పోలింగ్‌కేంద్రంలో 838 మంది ఓటర్లకుగాను 593 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 25వ పోలింగ్‌కేంద్రంలో 682 మంది ఓటర్లకుగాను 479 మంది, 26వ పోలింగ్ కేంద్రంలో 686 మందికిగాను 484 మంది ఓటర్లు, వత్సవాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 27వ పోలింగ్‌కేంద్రంలో 550 మంది ఓటర్లకుగాను 359 మంది, 28వ పోలింగ్‌కేంద్రంలో 932 మంది ఓటర్లకుగాను 654 మంది ఓటేశారు. పెనుగంచిప్రోలులోని కేవీఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 29 పోలింగ్‌కేంద్రంలో 758 మంది ఓటర్లకుగాను 594 మంది, 30వ పోలింగ్‌కేంద్రంలో 777 మంది ఓటర్లకుగాను 603 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

నందిగామ నియోజకవర్గంలో..

నందిగామ పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 31వ పోలింగ్ కేంద్రంలో 1,027 మంది ఓటర్లకుగాను 625 మంది ఓటుహక్కు వినియోగించుకోగా, 32వ పోలింగ్‌కేంద్రంలో 874 మందికిగాను 600మంది, 33లో 684మంది ఓటర్లకుగాను 489 మంది, 34లో 869 మంది ఓటర్లకుగాను 586 మంది, , 35వ పోలింగ్‌కేంద్రంలో 628మందికిగాను 438 మంది, చందర్లపాడు జెడ్పీ పాఠశాలలోని 36వ పోలింగ్‌కేంద్రంలో 729 మందికిగాను 544మంది, 37లో 839మంది ఓటర్లకుగాను 613మంది ఓటు వేశారు. కంచికచర్లలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 38వ పోలింగ్‌కేంద్రంలో 644మంది ఓటర్లకుగాను 451మంది, 39లో 583 మందికిగాను 481మంది, 40లో 570మంది ఓటర్లకుగాను 394 మంది, వీరులపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 41వ పోలింగ్ కేంద్రంలో 842 మందికిగాను 527మంది, 42వ పోలింగ్‌కేంద్రంలో 785 మందికిగాను 478మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు ఆర్డీఓ బాలకృష్ణ వివరించారు.

సంగమేశ్వరునికి రూ. 11.75 లక్షల ఆదాయం



హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

నందిగామరూరల్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి ఆలయానికి రూ. 11.75 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ నరసింహమూర్తి తెలిపారు. శివరాత్రి తిరునాళ్ల సందర్భంగా భక్తులు సమర్పించిన హుండీ కానుకలను శుక్రవారం లెక్కించారు. ఈసందర్భంగా ఈఓ మాట్లాడుతూ పూజా టికెట్‌ల ద్వారా రూ.5.88 లక్షలు, కానుకల ద్వారా రూ. రూ.4.39లక్షలు, కల్యాణ చదివింపుల ద్వారా రూ. 16,285, లడ్డూ ప్రసాదం విక్రయాల ద్వారా రూ. 89వేలు, కొబ్బరిచిప్పలు పోగు చేసుకునే హక్కు ద్వారా రూ.42 వేల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గాదెల వెంకటరామారావు, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పవన్‌కళ్యాణ్, ఉత్సవ కమిటీ సభ్యుడు గింజుపల్లి శ్రీనివాసరావు, ఆలయ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లు వేసిన కూటమి నాయకులు

- ప్రశ్నించిన పోలింగ్ సిబ్బందిపై నాయకుల తిట్ల పురాణం!
- 300పైగా దొంగ ఓట్లు వేశారంటూ జోరుగా ప్రచారం

కంచికచర్ల : ఫిబ్రవరి 27వ తేదీన నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కంచికచర్ల మండలంలోని మూడు పోలింగ్ కేంద్రాల్లో కూటమి నాయకులు దొంగ ఓట్లు వేసినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. జెడ్పీ హైస్కూల్‌లోని ఓ పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న పోలింగ్ అధికారి ఇదేమని ప్రశ్నిస్తే 'బతకాలని లేదా ..ఎవ్వడివి రా నీవు' అంటూ ఆ అధికారిపై సదరు నాయకులు తిట్లపురాణం ఎత్తుకున్నట్లు తెలిసింది. మండలంలో మొత్తం 1,797మంది ఓటర్లు ఉండగా, 1,326 ఓట్లు నమోదు అయ్యాయి. పోలింగ్ రోజున మధ్యాహ్నం 3నుంచి 4గంటల మధ్య కూటమి నాయకులు కార్యకర్తలు పోలింగ్ కేంద్రాల్లో దొంగ ఓట్లు వేసినట్లు సాక్షాత్తూ కూటమి నాయకులే శుక్రవారం కంచికచర్లలోని ఐసీఐసీఐ బ్యాంకు సందులో చర్చించుకుంటుండటం గమనార్హం. 'నేను 20 ఓట్లు వేయించానని ఓ కూటమి నాయకుడు..నేను నీకంటే ఎక్కువగా 35ఓట్లు వేయించానని మరోనాయకుడు, నేను మీ ఇద్దరి కంటే ఎక్కువగా 42ఓట్లు వేయించానంటూ ఇంకో నాయకుడు' ఇలా బహిరంగంగా చర్చించుకుంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. షాడో ఎమ్మెల్యేతోపాటు కీసర, పరిటాల, గనిఆత్కూరు, పేరకలపాడు, గొట్టిముక్కల, కంచికచర్ల కూటమి నాయకులు ఇలా చర్చించుకుంటుండటం విని విస్తుపోవడం స్థానిక ప్రజల వంతైంది. ఇలా కూటమి నాయకులు పోటీలుపడి దొంగఓట్లు వేయించడంతో ఓ పోలింగ్ కేంద్రంలో 82శాతం పోలింగ్ నమోదైనట్లు సమాచారం.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

బలుసుపాడు(జగ్గయ్యపేట అర్బన్): మండలంలోని బలుసుపాడులో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణంరాజు మాట్లాడుతూ వరిలో కాండంతొలుచు పురుగు, అగ్గి తెగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. జగ్గయ్యపేట ఏడీఏ భవాని, ఏవో వరలక్ష్మి మాట్లాడుతూ వరిలో యాజమాన్య పద్ధతులను వివరించారు. ఆర్‌ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం-దివ్యాంగుల పాలిట శాపం



పేట ప్రభుత్వాస్పత్రి వద్ద వేచి ఉన్న దివ్యాంగులు

జగ్గయ్యపేటఅర్బన్: దివ్యాంగుల కోసం కొంతకాలంగా ప్రభుత్వాస్పత్రి వద్ద నిర్వహిస్తున్న రీ వెరిఫికేషన్ సదరం క్యాంపును మూడురోజులుగా నిలిచిపోవడంతో దివ్యాంగులు ఇబ్బందిపడుతున్నారు. సంబంధిత అధికారులు సదరం క్యాంపు నిలిపివేత సమాచారాన్ని కూడా ప్రజలకు తెలియజేయకుండా గుట్టు చప్పుడు కాకుండా క్యాంపును నిలిపివేయడంతో, ఈ విషయం తెలియక మూడురోజులుగా దివ్యాంగులు క్యాంపు వద్దకు వస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు పడుతున్నారు. ఈ విషయంపై పేట ప్రభుత్వాస్పత్రి సూపరిండింటెంట్ డాక్టర్ ఆళ్ల హరీష్‌ను శుక్రవారం వివరణ కోరగా దివ్యాంగుల రీ వెరిఫికేషన్‌ను మార్చినెల 9వ తేదీ వరకు నిలిపివేసినట్లు తెలిపారు. అయితే క్యాంపు నిలిపివేత విషయాన్ని గ్రామ సచివాలయాల అధికారులకు తెలియజేశామని, వారు దివ్యాంగులకు తెలియజేసినట్లు లేరని డాక్టర్ హరీష్ తెలుపడం గమనార్హం.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



జగ్గయ్యపేటలో తాము తయారు చేసిన ప్రాజెక్టు నమూనాలతో చిన్నారులు



తమ పాఠశాల నమూనాను ప్రదర్శిస్తున్న ధర్మవరప్పాడు పాఠశాల విద్యార్థులు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని ఆయా పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో వాతావరణ కాలుష్యం, ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలను తెలియజేస్తూ ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఈసందర్భంగా హెచ్ఎం ఎ.లక్ష్మి మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనలతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. విద్యా కమిటీ చైర్మన్ సిహెచ్.శ్రీలక్ష్మి, సైన్స్ ఉపాధ్యాయులు వెంకట్రామమ్మ, సుబ్బలక్ష్మి, శ్రీనివాసరావు, సైదానాయక్, రెడ్డి పాల్గొన్నారు. నాగార్జున హైస్కూల్, తపోవన్ విద్యాలయంలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు ప్రదర్శించిన ఆయా ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. తపోవన్ విద్యాలయం ప్రిన్సిపాల్ సుధీర్, ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొమరగిరి భరద్వాజ్, పేట కార్యదర్శి షేక్ కాలేషా తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

మండలంలోని ధర్మవరప్పాడు ప్రాథమికోన్నత పాఠశాలలో సైన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. 8వ తరగతి విద్యార్థి గుగులోతు శ్యామ్ కుమార్ ప్రదర్శించిన తమ పాఠశాల నమూనా అందరినీ ఆకట్టుకుంది. హెచ్ఎం కనుకుర్తి మంగతాయమ్మ, ఉపాధ్యాయులు పర్సా లక్ష్మణరావు, సుజాత, వసంత, కృష్ణవేణి పాల్గొన్నారు.

సైన్స్ టీచర్‌కు సత్కారం..

నందిగామ టౌన్(నందిగామ రూరల్): మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని చందాపురం ఎంపియుపిఎస్ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ వేడుకల్లో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. అనంతరం సైన్స్ ఉపాధ్యాయుడు రాజేంద్ర బాబును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, విజయ్‌కుమార్, ఆహ్మద్ ప్యారా, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడ్జెట్ అంతా కాకిలెక్కలే



ఎంపీపీ బషీర్

కంచికచర్ల : కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లెక్కలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ శుక్రవారం విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కలరింగ్ ఎక్కువ.. కంటెంట్ తక్కువ అన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అప్పుల మీద తప్పుడు లెక్కలు చెపుతుందని ధ్వజమెత్తారు. అప్పుల మీద కూటమి ప్రభుత్వం చెబుతున్న లెక్కలు కరెక్టా..కాగ్ చెబుతున్న లెక్కలు కరెక్టా అని నిలదీశారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రజలకు కూటమి నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.14లక్షల కోట్లు అప్పు చేసిందని ప్రచారం చేసి, తీరా ఇప్పుడు రూ.4,38,278 కోట్లు అప్పులున్నాయని అధికారికంగా బడ్జెట్‌లో చెప్పడమేమిటని ప్రశ్నించారు. 9నెలల పాలనలో రికార్డు స్థాయిలో రూ.1.30లక్షల కోట్లకు పైగా అప్పులు తెచ్చిందన్నారు. 'తల్లికి వందనం' ఇస్తామంటూనే కేటాయింపులు మాత్రం అరకొరగా చేయడం చూస్తుంటే ఈపథకం అమలు కూడా అనుమానస్పదంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

కనుల పండువగా గ్రామోత్సవం



ప్రత్యేకాకర్షణగా అమ్మవారి ప్రభ



బేతాళ నృత్యాలు

నందిగామటౌన్(నందిగామ రూరల్): నందిగామలోని భద్రకాళి సహిత వీరభద్రస్వామి, దుర్గాదేవి, అంకమ్మతల్లి ఆలయంలో మహాశివరాత్రి మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి, అమ్మవారి ఊరేగింపును కన్నుల పండువగా నిర్వహించారు. పలురకాల పుష్పాలు, విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై రథోత్సవాన్ని వైభవంగా జరిపించారు. బేతాళ నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి.